క్లుప్తంగా

విత్తన దుకాణాల్లో తనిఖీ



తల్లాడలో విత్తన దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏఓ, ఎస్సై

తల్లాడ: తల్లాడలో పలు విత్తన దుకాణాలను బుధవారం మండల వ్యవసాయాధికారి ఎండి.తాజుద్దీన్, ఎస్సై వెంకటకృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు విత్తన డీలర్లకు పలు సూచనలు చేశారు. విత్తనాలను అనుమతి ఉన్న కంపెనీల నుంచి మాత్రమే తెచ్చుకోవాలి. రైతులకు రసీదులివ్వాలి. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విత్తనాలను విక్రయించాలని, సీడ్ యాక్ట్ ప్రకారంగా రిజిస్టర్లు నిర్వహించాలన్నారు.

ఏన్కూరులో 'బడిబాట'



అడ్మిషన్ ఇస్తున్న హెచ్ఎం సైదయ్య

ఏన్కూరు: మండలంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ఏన్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఏన్కూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం కె.సైదయ్య నేతృత్వంలో సిబ్బంది ఇంటింటికీ తిరిగి పాఠశాలలో సౌకర్యాలు, విద్యార్థులకు అందిస్తున్న విద్యా బుద్ధులు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆసక్తి ఉన్న బాల బాలికలకు స్పాట్ అడ్మిషన్‌లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది రాఘవరావు, వర్జీనియా, సులోచన, ప్రసాద్, అభిజిత్, సీఆర్‌పీ కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయాం..

మధిర: కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దారా బాలరాజు మృతితో నిబద్ధత కలిగిన నాయకుడిని పార్టీ కోల్పోయినట్లయిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని పేర్కొన్నారు. మండలంలోని ఆత్కూరులో బుధవారం జరిగిన బాలరాజు సభలో పాల్గొన్న నందిని ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన ఆయన కుటుంబానికి అండగా నిలుస్తామని తెలిపారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

బోనకల్: మండలంలోని చిన్నబీరవల్లిలో తెలకపల్లి వీరయ్య ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం మల్లు నందిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మర్సకట్ల సంజీవరావు, పైడిపల్లి కిశోర్, ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి కోటి, గత్తం బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సిస్టర్ రుహాన్సీకి సన్మానం



రుహాన్సీని సన్మానిస్తున్న ఆర్‌సీఎం విచారణ గురువులు

కల్లూరురూరల్: మండలంలోని తాళ్లూరు వెంకటాపురం గ్రామానికి చెందిన మేక జాన్సీ ఏసుక్రీస్తు దివ్యకారుణ్య మందిరంలో సిస్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం తాళ్లూరు వెంకటాపురంలో ఘనంగా సన్మానించారు. పెద్దకోరుకొండి ఆర్‌సీఎం విచారణ గురువు జ్యోతిబాబుతో పాటు వివిధ సంఘాల గురువులు ఈ కార్యక్రమంలో పాల్గొని సిస్టర్ రుహాన్సీకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విచారణ గురువులు, కన్యశ్రీలు, క్రైస్తవ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సొసైటీ సేవలు వినియోగించుకోవాలి



బీమా చెక్కు అందిస్తున్న సొసైటీ చైర్మన్ శేఖర్‌రెడ్డి

చింతకాని: రైతులకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ చైర్మన్ కొండపల్లి శేఖర్‌రెడ్డి తెలిపారు. కోమట్లగూడెంకు చెందిన రైతు పల్లపు వెంకయ్య ఇటీవల మృతి చెందాడు. ఆయనకు సొసైటీలో సభ్యత్వం ఉండడంతో రూ.50వేల బీమా చెక్కును బుధవారం ఆయన కుటుంబ సభ్యులకు శేఖర్‌రెడ్డి అందించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ మారగాని శ్రీనివాసరావు, సొసైటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు కష్టాలు..!



పంట రుణాలకు ఇక్కట్లు

- రుణ అర్హత కార్డుల ఊసే లేదు
- సబ్సిడీలు లేవు
- సాగు చేయలేమంటున్న కౌలు రైతులు

చింతకాని: రైతు దేశానికి వెన్నెముక అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయానికి కౌలురైతు ఆయువుపట్టు. వ్యవసాయంలో ఒడిదుడుకులు ఎదురైన ప్రతిసారీ ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతాంగంలో అత్యధికులు కౌలు రైతులే ఉంటున్నారు. కౌలు రైతులకు రుణాలను అందించాలనే ఉద్దేశ్యంతో 2015లో రుణ అర్హత కార్డు (ఎల్ఈసీ) లను జారీ చేసిన గత ప్రభుత్వం తర్వాత కౌలు రైతుల గురించి పట్టించుకోలేదు. మండలంలో కౌలు రైతులకు సంబంధించి అధికారిక లెక్కలు కూడా ఏమీ లేవు. ప్రభుత్వం కౌలు రైతులకు రుణ అర్హత కార్డులను జారీ చేసిన 2015లో మండలంలో కౌలు రైతులు సుమారు 2వేల మందికి పైగా ఉండగా వారిలో కేవలం 436మంది కౌలు రైతులకు మాత్రమే రుణ అర్హత కార్డులను అందజేయగా.. వారిలో 81 మందికి మాత్రమే బ్యాంక్‌లు ఆనాడు రూ.11.50 లక్షల పంట రుణాలను అందజేశారు. ప్రతి ఏడాది వ్యవసాయ భూములను కౌలుకు తీసుకుని పంటలను సాగుచేసే రైతులు సంఖ్య ఏటేటా పెరుగుతూనే ఉన్నప్పటికీ ప్రభుత్వం వారి గురించి ఆలోచన చేయటం లేదు.

వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న కౌలురైతులు..

2015 తర్వాత కౌలు రైతుల గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో ప్రతి ఏడాది కౌలు రైతులు పంట రుణాల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తుంది. అంతేకాకుండా ప్రభుత్వం అందించే సబ్సిడీలు కౌలు రైతులకు వర్తించవు. ఈ ఏడాది వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో సాగు పనులకు సిద్ధమవుతున్న కౌలు రైతులకు పెట్టుబడులే వారికి ప్రధాన సమస్యగా మారుతున్నాయి. ప్రతి సీజన్‌కు పంట రుణాలను ఇవ్వాల్సిన ప్రభుత్వం ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవటంతో కౌలు రైతులంతా పంటల సాగుకోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుంది. మరోవైపు వ్యవసాయ పెట్టుబడులు కూడా విపరీతంగా పెరిగిపోయాయి.

పెరుగుతున్న పెట్టుబడులు..

సాధారణ రైతు ఒక ఎకరంలో పత్తి సాగుచేయాలంటే కనిష్టంగా రూ.55 వేలు ఖర్చు అవుతుంది. కౌలు రైతు అయితే అదనంగా రూ.20 నుంచి రూ.30 వేలు కౌలు చెల్లించాలి. కనుక కౌలు రైతుకు ఎకరం సాగుకు సుమారు రూ.85 వేలు పెట్టుబడి ఖర్చు వస్తుంది. ఈ పెట్టుబడి ఖర్చులన్నీ వడ్డీకి తెచ్చుకొని ఇబ్బందులు పడాల్సివస్తుంది. అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ద్వారా అందించే రుణాలు, సబ్సిడీ ఎరువుల వంటి ప్రయోజనాలు పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటు ప్రభుత్వ సాయం అందక, ఇటు పెరిగిన వడ్డీలు చెల్లించలేక మరోమార్గం లేక ఆత్మహత్యలకు పాల్పడడం గమనార్హం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పంటల సాగుకు రుణాలను ఇప్పించి ఆదుకోవాలని కౌలు రైతులు కోరుతున్నారు.

రుణాలు అందించాలి..



పెరిగిన పెట్టుబడి ఖర్చులతో పంటల సాగు కష్టతరంగా ఉంది. గతేడాది కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి పంటలను సాగు చేయగా గిట్టుబాటు ధరలు లేక తీవ్రనష్టం వాటిల్లింది. బ్యాంక్‌లు పంట రుణాలు ఇవ్వక బయట అప్పులు తెచ్చి పంటలను సాగు చేస్తే అప్పులే మిగిలాయి. ప్రభుత్వం, బ్యాంక్‌లు పంట రుణాలను అందించి ఆదుకోవాలి.

– కాలంగి సైదులు, కౌలు రైతు, మత్కేపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి..



కౌలు రైతులకు పంటల సాగుకై వేలాది కోట్లు రుణాలుగా అందిస్తామని చెప్పిన గత ప్రభుత్వం ఆచరణలో పూర్తిగా విఫలమైంది. ప్రభుత్వం చెప్పేదానికి బ్యాంకర్లు చెప్పేదానికి పొంతన లేదు. ప్రభుత్వం జారీ చేసిన రుణ అర్హత కార్డుల వలన ప్రయోజనం శూన్యం. కాంగ్రెస్ ప్రభుత్వమైనా కౌలు రైతులకు రుణాలను అందించాలి.

– యదవల్లి వెంకటేశ్వర్లు, కౌలు రైతు, పాతర్లపాడు

రాష్ట్ర ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శం



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిటౌన్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. పట్టణంలోని 1, 2, 3, 4, 17వ వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ జెండాలు ఆవిష్కరించటంతో పాటు ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయని.. ఆ తర్వాత మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే అవకాశం లభించిందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నియోజకవర్గంలో 1,200 ఇళ్లు కూడా మంజూరు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర పాలనలోనే 3,500 ఇల్లు మంజూరు అయ్యాయన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలందరు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా, నాయకులు తోట సుజలరాణి, గాదె చెన్నారావు, చల్లగుళ్ల నర్సింహారావు, ఎండి కమల్‌పాషా, దూదిపాల రాంబాబు, ప్రసాద్, పింగళి సామేలు, హౌసింగ్ ఏఈ పవన్ పాల్గొన్నారు.

గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న మల్లాది వాసు

మధిర: మధిర జూనియర్ కాలేజీ గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఈనెల 8న ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని కమిటీ బాధ్యులు తెలిపారు. మధిరలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ 1970 నుంచి ఇప్పటివరకు కళాశాలలో బోధించిన గురువులు, చదువు పూర్తిచేసిన విద్యార్థులకు సమాచారం ఇచ్చామని వెల్లడించారు. అలాగే, వివిధ హోదాలు, దేశ, విదేశాల్లో స్థిరపడిన వారు కూడా హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ప్రిన్సిపాల్ కర్నాటి రామ్మోహన్రావుతోపాటు కళ్యాణం వెంకటేశ్వరరావు, అద్దంకి విప్లవకుమార్, మల్లాది వాసు, బెజవాడ రవిబాబు, మిరియాల రమణగుప్తా, బీ.వీ.ఆర్, మక్కెన నాగేశ్వరరావు, ఎం.ఏ.రహీం తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న యోగా గురువులు

తల్లాడ: ఈ నెల 21నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవంపై బుధవారం తల్లాడలో అవగాహన కల్పించారు. తల్లాడ ఆయుష్ హోమియో హాస్పటల్, తల్లాడ యోగా సెంటర్‌లో డాక్టర్ నీలిమ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మానసికంగా, ఉల్లాసంగా ఉండాలంటే ప్రతి రోజు సాధన చేస్తూ ఉంటే మాత్రలతో అవసరం లేకుండా ప్రతి మనిషికి వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కర్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య, యోగా గురువులు పులబాల వెంకటేశ్వర్లు, శ్రీదేవి, కొమ్మినేని రామయ్య, బండారు కృష్ణారావు, డి.అజయ్‌కుమార్, ఆంజనేయులు, కృష్ణారావు, శ్రీనివాసరాజు, శ్రీరామ్మూర్తి, రజిని, లక్ష్మి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమైన మదన్‌లాల్..



సంస్మరణ సభలో మాట్లాడుతున్న జగన్‌నాయక్

కారేపల్లి: వైరా నియోజకవర్గ ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి పాటుపడిన మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ లేని లోటు తీర్చలేనిదని సింగరేణి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వాంకుడోతు జగన్ నాయక్ అన్నారు. ఇటీవల మృతి చెందిన మదన్‌లాల్ సంస్మరణ సభ బుధవారం కారేపల్లిలో నిర్వహించగా వివిధ పార్టీలు, సంఘాల నాయకులు ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం జగన్‌తో పాటు మాట్లాడుతూ మదన్‌లాల్ ఆశయ సాధనకు ప్రతీఒక్కరు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఉన్నం వీరేందర్, హన్మకొండ రమేష్, రావూరి శ్రీనివాసరావు, జడల వెంకటేశ్వర్లు, షేక్ గౌసుద్దీన్, పెద్దబోయిన ఉమాశంకర్, డొంకెన రవీందర్, ధరావత్ మంగీలాల్, జడల వసంత, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడి మృతికి సంతాపం

ముదిగొండ: మండలంలోని చిరుమర్రి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎన్‌వీకే ప్రసాద్(54) బ్రెయిన్‌స్ట్రోక్‌తో మంగళవారం రాత్రి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని ఎంఈఓ రమణయ్య, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్.రంజాన్, జిల్లా కార్యదర్శి సురేష్, నాగేశ్వరరావు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సందర్శించి నివాళులర్పించారు.

సీపీఐ నాయకుల నివాళి..

చింతకాని: మండలంలోని కొదుమూరు గ్రామంలో సీపీఐ సీనియర్ నాయకుడు ఉప్పల భిక్షం(60) అనారోగ్యంతో బుధవారం మృతి చెందటంతో పార్టీ నాయకులు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర రావు, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కూచిపూడి రవి, నాయకులు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు: కల్లూరు సబ్‌స్టేషన్‌లోని పేరువంచ, కప్పలబంధం ఫీడర్ల పరిధిలోని ముగ్గు వెంకటాపురం, పేరువంచ, కప్పలబంధం గ్రామాలలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం.. గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ వెంకట్ కోరారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన



ముష్టికుంట్ల బీసీ కాలనీలో ఆందోళన చేస్తున్న మహిళలు

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలోని బీసీ కాలనీ మహిళలు తాగునీటి సమస్యను తీర్చాలని బుధవారం ఆందోళన చేశారు. గత 20 రోజుల నుంచి మిషన్ భగీరథ నీళ్ల రాక.. పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినప్పటికీ సమస్యను పరిష్కరించటం లేదని, మరమ్మతు చేయడానికి నిధులు లేవని చెబుతున్నారని తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని భద్రమ్మ, ప్రమీల, విజయ, నిర్మల, వరలక్ష్మీ, భవాని, తోటపల్లి రమణ, సుంకర వెంకట్రావమ్మ, దుప్పా రమణ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వైరారూరల్: మండలంలోని గరికపాడు గ్రామ శివారులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా, గంపలగూడెం మండలం, సత్యలంపాడు గ్రామానికి చెందిన పాలిశెట్టి వెంకటేశ్వర్లు ద్విచక్రవాహనంపై వైరా నుంచి తన స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలోని గరికపాడు గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం ఆయనను వైరాలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

కొణిజర్ల: తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 3వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం తక్షణమే వేతనాలు చెల్లించాలని మైనార్టీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ యాకూబ్ పాషా ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం తనికెళ్లలోని మైనార్టీ గురుకులంలో ఆయన మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా ఉద్యోగులకు జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెగ్యులర్ సిబ్బందికి జీతాలు చెల్లిస్తూ ఔట్ సోర్సింగ్ సిబ్బందిని మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఆయన వెంట ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు.

కల్లూరు మున్సిపాలిటీలో.. వార్డుల విభజన పూర్తి

8 పంచాయతీలతో కొత్త మున్సిపాలిటీ



కల్లూరు మున్సిపాలిటీ కార్యాలయం

కల్లూరు: కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీ మున్సిపాలిటీగా మారి వారం రోజులు కావస్తుంది. మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడు ఓటర్లు 12,500 మంది కాగా.. జనాభా 18వేల మంది ఉన్నారు. ప్రస్తుతం కల్లూరు పంచాయితీతో పాటు కప్పలబంధం, పుల్లయ్యబంజర్, కిష్టయ్యబంజర్, హనుమాతండా, తూర్పు లోకవరం, పడమర లోకవరం, వాచ్యా నాయక్ తండా పంచాయతీలను కలుపుకుని కొత్తగా మున్సిపాలిటీగా విస్తరించింది. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీ జనాభా 26వేల మంది కాగా ఓటర్లు 18,691 మంది ఉన్నారు. కల్లూరు మున్సిపాలిటీని 20 వార్డులుగా విభజించారు. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు వార్డుల విభజనపై అభ్యంతరాలు ఉంటే తెలియపరచాలని అధికారులు పేర్కొన్నారు. ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్‌గా మధిర కమిషనర్ ఎ.సంపత్‌కుమార్ వ్యవహరిస్తుండగా.. స్పెషల్ ఆఫీసర్‌గా ఇల్లెందు కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ వ్యవహరిస్తున్నారు.

మున్సిపాలిటీలో ప్రస్తుతానికి 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పనులు జరుగుతున్నాయి. పారిశుద్ధ్యం, రహదారులు, డ్రెయినేజీ, తాగునీరు, విద్యా, వైద్యం, గృహ నిర్మాణాలు, స్థిరచర ఆస్తుల కార్యకలాపాలు, పలు రూపాలలో వచ్చే పన్నులు, వివిధ మౌళిక సదుపాయాలు మున్సిపాలిటీ చట్టం ప్రకారం కొనసాగుతాయి.

అభ్యంతరాలు ఉంటే తెలపాలి..



కల్లూరు మున్సిపాలిటీలో 20 వార్డులుగా విభజించడం జరిగింది. విభజనలో ఏమైనా అభ్యంతరాలు ప్రజలు తెలియ చేయాలనుకుంటే ఈ నెల 11వ తేదీ లోగా తెలియ చేయవచ్చు.

– నందిశెట్టి నాగేశ్వరరావు, ఈఓ

అభివృద్ధి చెందుతుంది..



కల్లూరు మున్సిపాలిటీ కావడం చాలా సంతోషంగా ఉంది. మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే రాగమయిల కృషి ఫలించింది. కల్లూరు మున్సిపాలిటీలో మౌళిక సదుపాయాల కల్పనతో పాటు అభివృద్ధి పనులు చేసేందుకు నిధులు పుష్కలంగా మంజూరు అవుతాయి. ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

– కల్యాణ్ కిషోర్, కల్లూరు

అవసరానికి తగ్గట్టుగా ఎరువులు వాడండి



సత్తుపల్లి: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు



మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కె.రవికుమార్

సత్తుపల్లి: రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా రసాయన ఎరువులను సమతూల్యంగా వాడాలని వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త ఎం.రాంప్రసాద్ అన్నారు. బుధవారం కాకర్లపల్లి రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని నిర్వహించారు. యూరియా ఇతర ఎరువులను తగిన మోతాదుల్లో వాడటం వల్ల సాగు ఖర్చులు తగ్గించుకొని ఇతర లాభాలు పొందవచ్చన్నారు. పంటల సాగులో రైతులు పాటించాల్సిన శాస్త్రీయ మెలకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అనూష, శాస్త్రవేత్త ఆర్.రమేష్, వెటర్నరీ వైద్యులు శశిదీప్, కె.వెంకటేశ్వరరావు, సర్వేశ్వరరావు, సాయి కిరణ్, రైతులు పాల్గొన్నారు.

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల రైతు వేదిక భవనంలో బుధవారం నిర్వహించిన రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమంలో వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, వైరా కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ పాల్గొని మాట్లాడారు. రైతులు తక్కువ యూరియా వాడి సాగు ఖర్చును తగ్గించాలన్నారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.చైతన్య వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ యం.ఫణిశ్రీ మాట్లాడుతూ.. పంట మార్పిడి సుస్థిర ఆదాయం సాగునీటి ఆదా తదితర విషయాలు గురించి వివరించారు. జిల్లా రైతు సంఘం నాయకుడు నల్లమల వెంకటేశ్వర రావు, ఉద్యాన శాఖాధికారి ఏ.వేణు, ఏఓ బాలాజీ, ఏఈఓలు సరిత, హర్షవర్ధన్, అఫ్రీన్, కుమారరాజా, శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మతల్లికి ప్రత్యేక పూజలు



మంత్రి తుమ్మలకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న వేదపండితులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లిలో మంగళవారం నుంచి మూడురోజుల పాటు జరిగే ముత్యాలమ్మ అమ్మవారు, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠ, నాభిశిలాంభిక(బొడ్రాయి) ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపనిషత్ పారాయణం, సర్వతో భద్ర మండలం ఉపవేదిక మండవ నిత్యార్చనలు, క్షీరాధివాసం, 10 గంటలకు 108 మంది మహిళలతో లక్ష్మీ పూజ, మంత్ర పుష్పనీరాజనం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు నిత్య అర్చనలు, రంగవల్లి, భాజాభజంత్రీల నడుమ కోలాటము, నృత్య గీతాలతో అమ్మవారి ఊరేగింపు, యాగమండపం వద్ద అనుష్టాన మంత్ర హోమం, మంగళహారతి, యాగమండలి బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. నేడు నాభిశిలాంబిక(బొడ్రాయి) ప్రతిష్ఠ, అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే 'భూ భారతి'

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



కల్లూరు: రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న ఏఎంసీ చైర్మన్ నీరజదేవి



ఏన్కూరు: గార్లొడ్డులో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ రాజేందర్



ఎర్రుపాలెం: దరఖాస్తులు తీసుకుంటున్న తహసీల్దార్ ఉషాశారద

- కల్లూరు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టం రైతుల, భూయజమానుల సమస్యలను పరిష్కరించేందుకేనని ఏఎంసీ చైర్మన్ భాగం నీరజదేవి పేర్కొన్నారు. బుధవారం కల్లూరు రైతు వేదికలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రైతుల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో పొందుపరచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పులి సాంబశివుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.
- తల్లాడ: మండలంలో బుధవారం గోపాలపేట, కలకొడిమ గ్రామాల్లో భూ సమస్యలపై జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 306 దరఖాస్తులు వచ్చాయి. గోపాలపేట రెవెన్యూ సదస్సుకు కల్లూరు ఆర్డీఓ ఎల్.రాజేందర్ గౌడ్ హాజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ స్టాలిన్, ఆర్ఐలు భాస్కర్, ఖాజా మొయినుద్దీన్, వీఆర్ఏలు పాల్గొన్నారు.
- ఏన్కూరు: మండలంలోని జన్నారం ఎస్టీ కాలనీ, గార్లొడ్డు గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను ఆర్డీఓ రాజేందర్ గౌడ్ పరిశీలించారు. రెండో రోజు మొత్తం 328 దరకాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, డీటీ కిరణ్, ఆర్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- కొణిజర్ల: మండలంలోని గోపతి, తుమ్మలపల్లి రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన సదస్సులలో రైతులు సమస్యల పరిష్కారానికి భారీగా దరకాస్తులు సమర్పించారు. గోపతి రెవెన్యూ పరిధిలోని చిన్న గోపతి, పెద్దగోపతి, అనంతారం బొట్లకుంట గ్రామాల నుంచి 360 దరఖాస్తులు రాగా, తుమ్మలపల్లి, అన్నవరం గ్రామాల నుంచి 280 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ జి.రాము తెలిపారు. ఏఎస్ఓ తిరపతిరావు, సీనియర్ అసిస్టెంట్ యాదగిరి, గిర్దావర్‌లు రమేష్, అశోక్ సిబ్బంది పాల్గొన్నారు.
- చింతకాని: మండలంలోని నర్సింహాపురం, బస్వాపురం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో తహసల్దార్ అనంతరాజు పాల్గొని మాట్లాడారు. నర్సింహాపురం గ్రామంలో 33, బస్వాపురం గ్రామంలో 36 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ వీరభద్రనాయక్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రఘు, జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.
- ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం, వెంకటాపురం గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించగా.. జమలాపురం గ్రామ రెవెన్యూ సదస్సులో 39, వెంకటాపురం సదస్సులో 64మంది రైతులు తమ సమస్యలపై దరఖాస్తులు అందించారు. మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు, తహసీల్దార్ ఎం.ఉషాశారద, ఆర్ఐలు రవికుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.